విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-తణుకు: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కుకు నమోదు చేయించు కోవాలని తణుకు మున్సిపల్ కమిషనర్, రిటర్నింగ్ అధికారి బి. వెంకట రమణ సూచించారు. స్థానిక శ్రీమతి కొండేపాటి సరోజినీ దేవి మహిళా కళాశాల డిగ్రీ,పీజీ (అటానమస్) లో స్వీప్ లో భాగంగా బుధవారం ఓటు నమోదు అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, రిటర్నింగ్ అధికారి బి. వెంకటరమణ మాట్లాడారు. ఓటు హక్కు ద్వారా మన చుట్టూ ఉన్న సమాజంలో మార్పు తీసుకురావచ్చని, ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తణుకు మండల తహసీల్దార్ పి ఎస్ డి ప్రసాద్ మాట్లాడుతూ ఓటు నమోదులో యువతీ యువకుల సంఖ్యను గణనీయంగా పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 80 మందికి పైగా విద్యార్థినులు ఓటు నమోదు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, టౌన్ ప్లానింగ్ అధికారి వై శ్రీనివాస్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ జి. రమ్య, సిహెచ్ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

గణిత బ్రహ్మ లక్కోజు సంజీవరాయ శర్మ జయంతి

విశాలాంధ్ర- ఉంగుటూరు : గణితబ్రహ్మగా పేరొందిన లక్కోజు సంజీవరాయ శర్మ జయంతి వేడుకలు ఉంగుటూరు మండలం బొమ్మిడి హైస్కూలులో బుధవారం జరిగింది. అంధుడైన ప్పటికి ప్రపంచంలో ఆరు వేల గణితావధానాలు చేసిన ఏకైక వ్యక్తిగా పేరు సంపాదించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, బీహారు, ఢిల్లీ రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి ఆరువేల ప్రదర్శనలు ఇచ్చాడు. గణితావధానంలో, పుట్టిన తేదీ, సమయము, ప్రదేశము చెప్పగానే, దానికి సంబంధించిన తిథి, వారము, నక్షత్రము, కరణము, యోగము, వర్జ్యము, రాశి కూడా చెప్పి, కొంతవరకు జాతకం కూడా చెప్పేవారని ప్రధానోపాధ్యాయులు పి.శ్రీదేవి వివరించారు. ఉపాధ్యాయిని నాగలక్ష్మి మాట్లాడుతూ కలం, కాగితం రెండూ ఉన్నా గంటల కొద్దీ సమయంలో కూడా చెప్పలేని సమాధానాల్ని ఆయన ప్రశ్న అడిగినంత సులభంగా, ఏమాత్రం తడుముకోకుండా, సమాధానం చెప్పేవారు అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరందామరాజు వేంకటేశ్వర రావు, నాగు, రమేష్, కృష్ణ, సురేష్, జయలలిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు శిక్ష

విశాలాంధ్ర - గణపవరం: ఆడపిల్లలకు వివాహ వయసు రాకుండా బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా చెల్లించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.తులసి అన్నారు. బుధవారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా గణపవరం మండలం కొమ్మర గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం బాల్య వివాహాల నిరోధక చట్టం- 2006 రూపొందించిందన్నారు. బాల్య వివాహాలు చేసినా ప్రోత్సహించిన శిక్ష తప్పదని ఆమె అన్నారు. బాల్య వివాహలు చేయటం వలన ఆడపిల్లలకు కలిగే నష్టాలు ఆరోగ్య పరంగా ఇబ్బందులు, చదువుకున్న ఆడపిల్లలు ఉంటే కుటుంబం ఆరో గ్యంగా ఉంటుందని తద్వారా సమాజం బాగుపడుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీఎం పిఓ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పి సరళ, వీఆర్వో అడబాల రామకృష్ణ ప్రసాద్, ఎం ఎస్ కె, కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి

విశాలాంధ్ర - కలిదిండి: ఇసుక సమస్యలు పరిష్కరించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏలూరు జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డ్ నందు భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్మాణరంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఇసుక మాఫియాతో నాయకులు చేతులు కలిపి ఇసుకను ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులు పనులు లేక రోడ్డున పడుతున్నారని తెలిపారు. భవన నిర్మాణ మెటీరియల్ ధరలు పెరిగిపోవడంతో గృహ నిర్మాణదారులు గృహలు నిర్మించుకునే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెటీరియల్ ధరలను తగ్గించాలన్నారు. ఈనెల 27 28 తేదీలలో విజయవాడలో జరిగే మహా ధర్నాకు భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వంశీ, ఎంపీడీవో దిన తేజ్ లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోతురాజుల. బాలాజీ, పరస. రాజేష్, కటిక.రెడ్డి శ్రీను, అల్లాడి. భోగేశ్వరావు, బత్తిన. సూరిబాబు, సానబోయిన. సత్యనారాయణ, షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం మండలంలో 10 గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో పది ధాన్యపు కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. ధర్మాజీగూడెం, మఠంగూడెం, లింగపాలెం, కె.గోకవరం, రంగాపురం, యడవల్లి, టీసీహెచ్ఆర్ పాలెం, అయ్యపరాజుగూడెం, కలరాయనగూడెం, భోగోలులో కొనుగోలు కేంద్రాలు ఉంటాయని అన్నారు. ఈ కేంద్రాలలో ఎ గ్రేడు ధాన్యానికి క్వింటాకు రూ. 2 వేల 203, బి గ్రేడు క్వింటా రూ. 2 వేల 183లు ఉంటుందని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అన్నారు. మండలంలో 6 వేల 700 ఎకరాలలో ధాన్యం పండిందని, దాదాపు 17 వేల టన్నుల దిగుబడులు వస్తాయని ఈయన పేర్కొన్నారు. మండలానికి మూడు లక్షల సంచులు కావాల్సి ఉండగా మొదట విడతగా 72 వేలు సంచులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

ప్రజల సమస్యలపై దృష్టి సారించని ప్రభుత్వం

విశాలాంధ్ర-తణుకు: ప్రభుత్వాలు మారినా సమస్యలకు పరిష్కారం దొరకక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే ఇరగవరం మండలం అర్జునుడుపాలెం గ్రామంలో పంచాయతీ రోడ్లను కొంతమంది రాజకీయ అండతో ఆక్రమించుకొని అధికారుల మద్దతుతో రోడ్లను సైతం ఆక్రమించుకొన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే తప్పుకోవడానికి సైతం సరైన స్థలం లేకపోవడం పై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అంబులెన్సు, అగ్నిమాపక దళం, ఇతరాత్ర వాహనాల రాక పోకలకు సరైన రోడ్ లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణదారులను గుర్తించి రోడ్డు వెడల్పు విషయంలో తగిన న్యాయం చేసి ప్రజలకు మేలు చేయవలసిందిగా గ్రామ ప్రజలు ఆశిస్తున్నారు.

ఫిష్ మార్కెట్‌తో వ్యాపారాభివృద్ధి

మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర -నరసాపురం టౌన్ : తీరప్రాంత మత్స్యకారులు వేటాడిన మత్స్య సంపద అమ్మకాలు జరుపుకునేందుకు ఫిష్ మార్కెట్టును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశు సంవర్ధక పాడి పరిశ్రమాభి వృద్ధి మత్స్య శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం నరసాపురం పట్టణం 11వ వార్డులో రూ.1 కోటి 50 లక్షల నిధులతో నిర్మించిన ఫిష్ మార్కెట్టును ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు, కలెక్టరు పి.ప్రశాంతితో కలసి రాష్ట్ర పశు సంవర్ధక,పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మత్స్య కారుల వ్యాపార అభివృద్ధికి ఫిష్ మార్కెట్ ఎంతో ఉపయోగ పడుతుంద న్నారు. ప్రతి ఫిషర్ మెన్ సద్వినియోగం చేసుకోవాల న్నారు. తాజా, క్వాలిటీ చేపలను అందించి వినియోగ దారుల మన్ననలు పొందాలని మంత్రి అన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ తీరప్రాంత మత్స్య కారుల జీవన స్థితిగతులు మారేందుకు ముఖ్యమంత్రి జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నా రన్నారు. పట్టణ ,తదితర మండల గ్రామ ప్రజలకు మంచి నాణ్యమైన సముద్ర ఉత్పత్తులను అందించి మంచి సేవలు అందించాలన్నారు. జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో యం అచ్యుత అంబరీష్, రాష్ట్ర ప్రభుత్వ అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగ రాజు, తహాశీల్దారు యస్ యం ఫాజిల్,పురపాలక సంఘం కమిషనరు డా. కె వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

విశాలాంధ్ర-భీమవరం: లబ్ధిదారులకు విరివిగా లోన్లు మంజూరు చేసి సంక్షేమం, అభివృద్ధి అమలులో బ్యాంకర్లు తోడ్పాటునివ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి కోరారు. బుధవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన బ్యాంకర్ల సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి హాజరై లబ్ధిదారులకు లోన్లు మంజూరు విషయమై బ్యాంకర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో, అభివృద్ధిలో బ్యాంకర్ల సహకారం ఎంతైనా అవసరమన్నారు. ఈ దిశగా పని చేసినప్పుడే ప్రగతి కనపడుతుందన్నారు. గత సమావేశానికి, నేటి సమావేశానికి లోన్లు మంజూరులో లక్ష్యసాధన చాలా తక్కువగా ఉందన్నారు. వివిధ పథకాల రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, డిసెంబర్ నెలాఖరు నాటికి అన్ని రుణాలను మంజూరు చేయాల్సిందిగా బ్యాంకర్లను ఆమె కోరారు. సంక్షేమం, అభివృద్ధికి తోడ్పాటుకు బ్యాంకర్ల ముందుకు వస్తే వ్యాపార పరంగా బ్యాంకర్లు కూడా లబ్ధి పొందుతారని అన్నారు. జిల్లాలో నేటి వరకు 20,816 దరఖాస్తులను అందుకోవడం జరిగిందని, సర్పంచ్ లాగిన్‌లో ఆమోదించినవి, అడ్మినిస్ట్రేషన్‌కు ఆమోదానికి వస్తాయన్నారు. జిల్లాలో 89 వేల సిసిఆర్సి కార్డులను జారీ చేసి చేయడం జరిగిందని, వాటిలో 40 వేల సిసిఆర్సి కార్డుదారులకు ఖరీఫ్ లో రూ.297 కోట్ల రుణాలను కౌలుదారులకు మంజూరు చేయడం జరిగిందన్నారు. రానున్న రబీలో కూడా ఇదే విధంగా కౌలు రైతులకు లోన్లు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, నాబార్డ్ డిడి టి అనిల్ కాంత్, డి ఆర్ డి ఏ పి.డి ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చేతిరాత పోటీల్లో జాతీయ, రాష్ట్ర స్థాయికి ఎంపిక

- ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

విశాలాంధ్ర - లింగపాలెం : విద్యార్థులలో నైపుణ్యతను పెంపొందించేందుకు చేతిరాత నిపుణుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంగ్ల భాష చేతిరాత పోటీలలో ధర్మాజీ గూడెం ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అర్హత పొందిన విద్యార్థులకు సర్వశిక్షా అభియాన్, మధ్యాహ్నభోజన పథకం కమిషనర్ బి.శ్రీనివాసరావు విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందించారు. ఈ పోటీలలో జాతీయ స్థాయికి 10, 9 తరగతులు చదువుతున్న ఎస్.ధర్మసాయితేజ, కె.అనుప్రియలు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయికి పదవ తరగతి చదువుతున్న ఆర్.జయశ్రీ, పి.గౌరీ, టి.శ్రీజ, 9వ తరగతి చదువుతున్న కె.తను, సి.హెచ్.నీలిమ, డి.లక్ష్మీప్రసన్న, సి.హెచ్.అనూష, 8వ తరగతి చదువుతున్న పి.మహితా సరళ ఎంపికయ్యారు. వీరిని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎన్. రాజు, ఇంగ్లీషు, తెలుగు పండిట్‌లు ఎల్.ప్రకాశరావులు అభినందన పత్రాలు అందించారు.

అభివృద్ధి పథంలో చింతలవల్లి

విశాలాంధ్ర-ముసునూరు: చింతలవల్లి గ్రామసచివాలయ పరిధిలో గడిచిన ఈ నాల్గున్నర సంవత్సరాల కాలంలో రూ.31,18,18,650 నిధులు సీఎం జగన్ మోహన్‌రెడ్డి మంజూరుచేసి అభివృద్ధి పథంలో తీసుకువెళుతున్నాడని వైస్ ఎంపిపి కోటగిరి రాజా నాయన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చింతలవల్లి గ్రామసచివాలయంలో సర్పంచ్ పల్లి సత్యనారాయణ,ఎంపిడిఓ జి.రాణి ఆధ్వర్యంలో పల్లెకు -పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ పరిధిలో సచివాలయం,రైతు భరోసాకేంద్రం, వెల్‌నెస్ సెంటర్ (ఆరోగ్యకేంద్రం) నాడు-నేడు పాఠశాల అభివృద్ధి, ఇలా ఎన్నో అభివృద్ధితో పాటు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్డ్ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, పంచాయతీకార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీతోనే సామాజిక న్యాయం

విశాలాంధ్ర -కైకలూరు : ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి (వై ఎపి నీడ్స్ జగన్) కార్యక్రమం కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరావు ఆదేశాల మేరకు ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కైకలూరు మండలం కైకలూరు-5 గ్రామ సచివాలయ పరిధిలోని మార్కెట్ యార్డులోనిర్వహించారు. సామాజిక న్యాయం జరగాలన్నా, ప్రజలకు సంక్షేమం అందాలన్నా,గత ప్రభుత్వం ప్రజలకు చేసిన అన్యాయాన్ని తెలుసుకొని వారికి న్యాయం చేయాలన్నా ఒక్క జగన్ తోనే సాధ్యం అన్నారు.

అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జండా ను ఆవిష్కరించి ఇంటింట ప్రచార కార్యక్రమంలో పాల్గొని గృహాలను సందర్శించారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు భత్రాజు శివాజీ,వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, యూత్ నాయకులు నిమ్మల సాయి, తోట మహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాల జీవో సవరణ చేయాలి

ఐజేయూ సెక్రటరీ సోమసుందర్

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల జీఓలో సవరణలు చేసి అర్హులైన అందరు పాత్రికేయులకు స్థలాలు ఇవ్వాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయు) జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం భీమవరంలో ఎపియుడబ్ల్యుజె భీమవరం ఏరియా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమ సుందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరులో జాప్యం జరిగినప్పుడు యూనియన్ తరపున ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసామన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా జిఓ జారీ చేయమని కోరగా ఆయన సమ్మతించా రన్నారు. జిఓలో నిబంధనలు కఠినంగా ఉండటం వలన అర్హులైన వారు బాగా తగ్గిపోతారని, మళ్లీ సవరణ చేసి జిఓ జారీ చేయాలని కోరారు. మీడియా రంగం పట్ల సమాజంలో మన పట్ల ధోరణి మారిందని, అందుకు అనుగుణంగా మనం జాగ్రత్తగా వృత్తి ధర్మం నిర్వహించాలన్నారు. ఇటీవల జర్నలిస్టుల్లో కొంత ప్రతికూల వ్యవహార శైలి పెరిగిందని దానివల్ల ప్రతిష్ట దిగజారుతోందని ఆవేదన చెందారు. పాత్రికేయలకు సంఘాలు చాలా ముఖ్యమని, వాటి ద్వారా ప్రతిష్ట పెంచుకుని నైతిక విలువలు ఆచరించాలని ఆయన కోరారు. ఎపియుడబ్ల్యుజె జిల్లా కన్వీనర్ గజపతి వరప్రసాద్ మాట్లాడుతూ అన్ని కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీనియర్ జర్నలిస్టు ఎర్రంశెట్టి గిరిజాపతి మాట్లాడుతూ జర్నలిజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంఘాల నాయకత్వంలో జాగ్రత్తగా వ్యవహరించి హక్కులు సాధించుకోవాలన్నారు. అధ్యక్షత వహించిన ఎపియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఎస్.సాయిబాబా మాట్లాడుతూ యూనియన్ కార్యక్రమాలు తెలిపారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి బోనం శీను, గంటా వేణుగోపాల్, బీసీఎన్ రిపోర్టర్ మణికంత తదితరులు మాట్లాడారు.

నూతన కార్యవర్గం : భీమవరం ఏరియా ఎపియుడబ్ల్యుజె (భీమవరం ఏరియా ప్రెస్ క్లబ్) అధ్యక్షుడిగా కె.వి.ప్రసాద్(ఆంధ్రజ్యోతి), ఉపాధ్యక్షులుగా నూకల సత్యనారాయణ(ఆంధ్రపత్రిక), గొల్ల రవిబాబు (సాక్షి టీవి), జనరల్ సెక్రెటరీగా కమ్మిల హనుమంతరావు(99 టీవీ), జాయింట్ సెక్రటరీగా బొక్కా రామాంజనేయులు(సాక్షి), సెక్రటరీలుగా నిమ్మల ఆదినారాయణ రాజు(6 టీవీ), చింతపల్లి శ్రీనివాస్(టీవీ9), కోశాధికారిగా గేదెల శ్రీనివాస్(పయనీర్), గౌరవ అధ్యక్షుడిగా వాకల సత్యసాయి బాబ(సాక్షి), మీడియా కోఆర్డినేటర్ గా టి.అయ్యప్ప స్వామి(టీసీఎన్), కార్యవర్గ సభ్యులుగా పడమటి కృష్ణ(ఆర్ టీవీ), కొత్తపల్లి రాజశేఖర్(విశాలాంధ్ర), గోవిందలపూడి వెంకటేష్(స్వతంత్ర టీవీ), తాళ్లూరిజయకుమార్(శ్రేయస్ టీవీ), కొట్టి మధు భాస్కర్(ఆంధ్రజ్యోతి), గౌరవ సలహాదారులుగా గంట వేణుగోపాల్ (వార్త)యర్రంశెట్టి గిరిజాపతి(సాయంత్రం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విజయవాడ మహాధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్లో జరిగే మహా ధర్నాలో రైతులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. భీమవరం సిఐటియు కార్యాలయంలో బుధవారం ఆకుల హరేరామ్ అధ్యక్షతన సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నల్ల సాగు చట్టాలను వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించిన మోడీ మళ్లీ వాటిని ప్రవేశ పెట్టడానికి చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్, తెలుగు రైతు సంఘం జిల్లా నాయకులు తమ్మినీడి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కం శెట్టి సత్యనారాయణ, సిఐటియు నాయకులు ఎం. రామాంజనేయులు, బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

బోరు అవినీతి ఆరోపణలపై దర్యాప్తు

విశాలాంధ్ర - లింగపాలెం : జలకళలో మఠంగూడెంలో వేసిన బోరులకు సంబంధించి అవినీతి జరిగిందని ఈనెల 10న ధర్మాజీగూడెంలో నిర్వహించిన ప్రత్యేక స్పందనలో జిల్లా అధికారు లకు ఇచ్చిన ఫిర్యాదుపై డ్వామా ఏపీడి శ్రీదేవి బుధవారం గ్రామానికి వచ్చి దర్యాప్తు చేశారు. జి.రామచంద్రరావు అనే రైతు మఠంగూడెంలోని సర్వే నెంబర్ 26/2లో బోరు వేసినట్టు చూపిం చారు. ఆ నెంబరులో ఎటువంటి బోరు నిర్మాణం జరగలేదని గ్రామానికి చెందిన జాస్తి లక్ష్మీనారాయణ జాయింట్ కలెక్టర్ లావణ్యకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేయాలని జాయింట్ కలెక్టర్ డ్వామా అధికారులను ఆదేశించారు. ఆ ఆదేశాలతో దర్యాప్తు చేపట్టారు. క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేశారు. తన భూమిలోనే జలకళలో బోరు వేశానని అవినీతి జరగలేదని ఆరోపణలు వచ్చిన రైతు ఏపీడికి తెలిపారు. గ్రామంలో దీనిపై విచారణ చేశారు. దర్యాప్తు చేసిన వివరాలను డ్వామా పీడి రాముకు అందచేస్తానని విచారణ చేసిన ఏపీడి తెలిపారు.

CHANGE OF NAME

I, AKKISETTI RAMBABU (NEW NAME), S/o AKKISETTI NAGESWARA RAO, Previously called AKKISETTY RAMBABU (OLD NAME), Resident of Flat No.E1, 5th Floor, Sujan Elite Homes,Park Street, Kodavalli Road, Narasayya Agraharam, Bhimavaram-534201, W.G.Dist, A.P, Now Changed my name from AKKISETTY RAMBABU (OLD NAME) to AKKISETTI AKKISETTI RAMBABU (NEW NAME) Today onwards Use my New Name for all further Transactions.

CHANGE OF NAME

I, AKKISETTI VIJAYA LAKSHMI SURYA KUMARI (NEW NAME), W/o AKKISETTI RAMBABU, Previously called AKKISETTY VIJAYA LAKSHMI SURYA KUMARI (OLD NAME), Resident of Flat No.E1, 5th Floor, Sujan Elite Homes,Park Street, Kodavalli Road, Narasayya Agraharam, Bhimavaram-534201, W.G.Dist, A.P, Now Changed my name from AKKISETTYVIJAYA LAKSHMI SURYA KUMARI (OLD NAME) to AKKISETTI VIJAYA LAKSHMI SURYA KUMARI (NEW NAME) Today onwards Use my New Name for all further Transactions.

ప్రత్యేక శ్రద్ధతో ఓటర్ల జాబితా రూపొందించాలి

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ఎటువంటి పొరపాటుకు తావులేని ఓటర్ల జాబితాను రూపొందించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పై ఈ ఆర్ ఓ., ఏ ఈ ఆర్ ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయం లోగా పరిష్కరించాలని, జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో అర్హత కలిగిన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుండి తొలగింపునకు గురికాకుండా చూడాలన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా అందిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 లను ఎన్నికల కమిషన్ నిబంధలు మేరకు నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించా లన్నారు. బిఎల్ఓలు క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో పరిశీలించేలా పర్యవేక్షించి, ఓటర్ల జాబితా స్వచీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత పై కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి, 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి, జిల్లా రెవిన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, ఎస్డీసీ గీతాంజలి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర , ప్రభృతులు పాల్గొన్నారు.

రైతులు తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడి సాధించాలి

విశాలాంధ్ర - గణపవరం: వరి పండించే ప్రతి రైతు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించి వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించా లని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గణపవరం మండలం అప్పనపేట గ్రామంలో డాక్టర్ వైయస్సార్ గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వరిలో వెదజల్లే పద్ధతి గురించి వివరించారు. ఈ పద్ధతి అనుసరించడం ద్వారా ఎకరాకు రూ.6 వేలు నుండి ఏడు వేల రూపాయలు ఖర్చు తగ్గించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఏడిఏ పి.మురళీకృష్ణ, ఉండి కెవికె శాస్త్రవేత్తలు మల్లికార్జున్ రావు, రాజేష్ మాట్లాడుతూ వరి పంటపై దిగుబడికి దోహదం చేసే అంశాలను రైతులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం పొలంబడి క్షేత్రంలో దిగి వరి దుబ్బుల కంకులను తీసుకుని వాటికి ఉన్న గింజలను లెక్కించి రైతులకు దిగుబడిని ఎలా లెక్కించాలి అనే విషయాన్ని చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో రైతులు, విఏఏలు,కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోగా దినతేజ్

విశాలాంధ్ర - కలిదిండి: కలిదిండి మండల పరిషత్ కార్యాలయానికి నూతన ఎంపీడీవోగా జి. దినతేజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత విధులు నిర్వహిస్తున్న రాంబాబు సెలవులో ఉన్నారు.గ్రూప్ 1 కి ఎంపికై కోనసీమ జిల్లా గాదిలంకకు చెందిన దినతేజ్ కలిదిండి ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఆయనను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది శాలువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దినతేజ మాట్లాడుతూ మండల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తానని, అన్ని వర్గాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మంచినీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపాలి

విశాలాంధ్ర - కలిదిండి: గ్రామాలలో మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఎంపీపీ చందన ఉమా మహేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పారుదలశాఖ అధికారులు గోపాలపురం, వెంకటాపురం, పోతుమర్రు గ్రామాలకు కోరుకొల్లు లాకుల వద్ద మోటార్లు ఏర్పాటు చేసి ఈ మూడు గ్రామాలలో ఉన్న మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని తెలిపారు. వివిధ శాఖల అధికారులు తో పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి బొర్రా.సత్యవతి, వైస్ ఎంపిపి లు కుసుమ పూడి కనకదుర్గా రాణి, కట్టా నాగలక్ష్మి, తహశీల్దార్ వంశీ, ఈవోపిఆర్డి వై. రాజారావు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

24న విభిన్న ప్రతిభావంతుల క్రీడోత్సవాలు

విశాలాంధ్ర -భీమవరం: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని 24వ తేదీ శుక్రవారం ఏలూరులో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి పి.రాకడమణి ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక వైకల్యం ఉన్న క్రీడాకారులకు ట్రైసికిల్ రేస్, జావెలిన్ త్రో, షాట్ పుట్, దృష్టి లోపం ఉన్న క్రీడాకారులకు రన్నింగ్, షాట్ పుట్, క్యారమ్స్, మానసిక వికలాంగులకు రన్నింగ్, షార్ట్ పుట్, డిస్కుత్రో తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయని ఆసక్తికలిగిన క్రీడాకారులు 24న ఉదయం ఏలూరులోని ఇండోర్ స్టేడియంకు చేరుకోవాలని జిల్లా అధికారి సూచించారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

విశాలాంధ్ర-టి నరసాపురం: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్య నారాయణ రాజు అన్నారు. కె జగ్గవరం ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.

అనంతరం సొసైటీ చైర్ పర్సన్ వాసిరెడ్డి మధు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ రైతులు దళారుల నుండి మోసపోకుండా ప్రభుత్వమే మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కె జగ్గవరం సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తెడ్లం, రాజు పోతేపల్లి, కేతవరం,అల్లం చర్ల రాజు పాలెం, బండి వారి గూడెం, అప్పలరాజు గూడెం రైతు భరోసా కేంద్రాల పరిధిలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తడికలపూడి శివ మాధవి కిషోర్,పర్సన్లు వంటిపల్లి వెంకటేశ్వరరావు, కొరప్రోలు రవి చంద్ర శేఖర్ రెడ్డి, వ్యవసాయ అధికారి డి ముత్యాలు రావు, సిఇఓ తనగాల వీర వెంకయ్య, రైతులు వంటి పల్లి సుబ్రహ్మణ్య, వెలిది రాంబాబు, వెలిది గంగాధర రావు, సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్: విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని దడగ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు సి.హెచ్ చంద్రశేఖర్ అన్నారు. ఇటీవల పాఠశాల విద్యా ర్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ సాధించిన 9వ తరగతి చదువుతున్న ఊబా వెంకటేష్ను ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యతోపాటు ఎంచుకున్న క్రీడా రంగంలో విజయం సాధించేవరకు కృషి పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులకు పాఠశాల తరపున పూర్తి సహకారం అందిస్తామ న్నారు. క్రీడల్లో రాణిస్తే చదువుకున్న పాఠశాల, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులతో పాటు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రతీ రోజు కొంత సమయం క్రీడలు, వ్యాయామం, యోగా చెయ్యడం ద్వారా మానసిక వత్తిడి నుండి విముక్తి లభిస్తుందన్నారు. శారీరక, మానసిక ధృఢత్వం కొరకు ప్రతీ విద్యార్థి క్రీడా పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలు సులభంగా లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది, గ్రామస్తులు వెంకటేషు అభినందించారు.

రైతులకు నాణ్యమైన ట్రాక్టర్లు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : రైతులకు నమ్మకమైన ట్రాక్టర్లను అందించడమే మహీంద్రా షోరూమ్ లక్ష్యమని మహీంద్రా ట్రాక్టర్ షోరూమ్ అధినేత నేరెళ్ళ వశిష్టఅన్నారు. స్థానిక రామచంద్రా పురంలోని మహీంద్రా షోరూమ్ వద్ద జంగారెడ్డిగూడెం షోరూమ్ సేల్స్ మేనేజర్ ఆకుమర్తి రామారావు అధ్యక్షతన రైతు సదస్సు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం డివిజన్ లోని వివిధ మండలాలకు చెందిన 300మంది రైతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు .ఈ సందర్భంగా ఇటీవల దసరా,సందర్భంగా నిర్వహించిన డ్రాలో గెలుపొందిన రైతులకు 4 ద్విచక్ర వాహనాలు,4 ఎల్. ఈ డి టీవీ లు,4 ఇన్వర్టర్ లు,70 ప్రత్యేక బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా ట్రాక్టర్స్ సేల్స్ మేనేజర్ టి.ఎం.రామకృష్ణ,సుదర్శన్,రైతులు,షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

జన సైనికులకు అండగా పార్టీ

విశాలాంధ్ర-వీరవాసరం: ప్రజలకు, కార్యకర్తలకు అండగా జనసేన పార్టీ ఉంటుందని నియోజక వర్గ ఇన్‌చార్జి కొటికలపూడి గోవిందరావు తెలిపారు. మండలంలోని మత్స్యపురి, పంజావేమవరం గ్రామాలకు చెందిన జనసేన క్రియాశీల సభ్యులు కొందరు గాయపడగా వారికి మెడికల్ ఖర్చుల నిమిత్తం పార్టీ నుంచి వచ్చిన ఇన్సూరెన్స్ చెక్కులను స్థానిక మండల పార్టీ కార్యాలయంలో ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న నాయకులను, కార్యకర్తలను ఆదుకునేందుకు తమ పార్టీ ముందుంటుంద న్నారు. అనంతరం మండలంలో కొన్ని గ్రామ కమిటీలను నియమించి వాళ్ళకి నియామక పత్రం అందచేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పుప్పాల బాలాజి, నాయకులు బండి రమేష్ కుమార్, ఎంపీటీసీలు విజయలక్ష్మి, ఇందిరా, మోపిదేవి విశ్వేశ్వరరావు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాలధారణ భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం

విశాలాంధ్ర-ఉండి: మాల ధారణ భక్తులు బిక్ష సౌకర్యార్థమే ఈ షెడ్డు నిర్మాణం చేయడం జరిగిందని ఉండి పంచాయతీ ఉప సర్పంచ్ గొట్టు ముక్కల కళ్యాణ వర్మ తెలిపారు. మండల కేంద్రమైన ఉండి కృష్ణమ్మ చెరువు ప్రక్క తన మిత్రుడు సాగిరాజు శ్రీహరి రాజు తో కలిసి రూ. 6.50 వ్యయంతో రేకుల షెడ్డు నిర్మించి మాల ధరించిన అయ్యప్పలకు, భవానీలకు, శివ స్వాములకు బిక్ష ఏర్పాటు చేసేందుకు నిర్మించడం జరిగిందని వారు అన్నారు. ప్రతి సంవత్సరం భవానీలు, అయ్యప్పలు శివ స్వాములు ఎంతమంది వచ్చినా బిక్ష పెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకు బిక్ష ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రెండు దాటిన తర్వాత వచ్చిన భక్తులకు కూడా బిక్ష సౌకర్యం ఉన్నదన్నారు. ఇంటిదగ్గర కుదరక బిక్ష ఇబ్బంది పడుతున్న భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర - పెనుమంట్ర: పెనుగొండ ఈపీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయం నందు ఈనెల 24తేదీన శుక్రవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు నర్సాపురం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. సురేష్ కుమార్ తెలిపారు. వినియోగదారుల ఫోరం చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి బి. సత్యనారాయణ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో వినియోగదారులు విద్యుత్ సమస్యలను వినియోగదారులు పరిష్కరించుకోవచ్చు అన్నారు.

గిరిజనులకు ఉచితంగా గ్యాస్ పంపిణీ

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉండి ఇప్పటి వరకు గ్యాస్ కనెక్షన్ లేనివారికి ఉచితంగా హెచ్.పీ గ్యాస్, బండ ఇవ్వనున్నట్లు తాటి ఆకులగూడెం ఎంపీటీసీ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు సున్నం సురేష్ తెలిపారు బుధవారం దర్భ గూడెం పంచాయతీ పాత పండు వారి గూడెం గ్రామంలో ఉచితంగా గ్యాస్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి యువజన పథకం క్రింద హెచ్పీ గ్యాస్ వారి ఆధ్వర్యంలో గిరిజనులకు తెల్ల రాసిన కార్డు కలిగి ఉండి ఇప్పటివరకు ఏ విధమైన గ్యాస్ కనెక్షన్లు లేనివారికి హెచ్.పీ గ్యాస్ వారు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు మండలంలోని అర్హులైన గిరిజనులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో దర్భ గూడెం సర్పంచ్ సున్నం ఉషారాణి హెచ్.పీ గ్యాస్ ప్రతినిధులు పైద దుర్గమ్మ పైదా జగదీష్ గిరిజనులు స్థానికులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

విశాలాంధ్ర-భీమడోలు: కార్తీకమాసం గోదావరి కాలువ స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన భీమడోలు మండలం పాతూరులో జరిగింది. బుధవారం పాతూరు రేవులో సూరప్పగూడెం గ్రామానికి చెందిన చామర్తి శ్రీనివాసరావు కార్తీకమాసం సందర్భంగా కాలువస్నానానికి వచ్చి రేవు స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కాలువలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న భీమడోలు ఫైర్ ఆఫీసర్ నాగరాజు , ఫైర్ సిబ్బంది స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీసారు. కాలువరేవుకి పది అడుగుల దూరంలోనే మృతదేహం లభించింది. శ్రీనివాసరావు మృతితో ఆ ప్రాంతం బంధువుల రోదనలతో మిన్నంటింది.

కేంద్ర పథకాలు అందరికీ అందేలా చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి ఎండి రజాఉల్లా తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై బుధవారం అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా చూడటం, పథకాలు పొందిన వారు వాటిని ఎలా ఉపయోగించుకుంటున న్నది వారి ద్వారానే తెలియజేయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని గుర్తించి సన్మానించాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్నికార్యక్రమాలు నిర్వహించ బడతాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి లక్ష్మి, ఎంపీడీవో మంగా కుమారి, విద్యాశాఖాధికారి ఎస్.కళ్యాణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లక్షల వ్యయం తుక్కులో కలిసి పోవాల్సిందేనా..!

- రూ.లక్షలు పోసి.. గాలికి వదిలేసి !
- చెత్త సేకరణ రిక్షాలు తుప్పుపట్టిపోతున్నా పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-వీరవాసరం : వీరవాసరం మేజర్ పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను గాలికొదిలేసి పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. లక్షల రూపాయలు పోసి గ్రామాల్లో చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన రిక్షాలు వినియోగంలోకి రాకుండానే తుప్పుపట్టి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన రిక్షాలు కళ్ల ముందే తుప్పుపట్టి పోతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రజల సొమ్ము వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకో కుండా, ప్రజల సమస్యలు గాలికొదిలేసి కాలక్షేపం కోసం పంచాయతీకి వచ్చి వెళుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీర వాసరం గ్రామానికి కేటాయించిన చెత్త తరలింపు రిక్షాలు నెలల తరబడి మూలన పడి ఉన్నాయి. గ్రామంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు రిక్షాలు, డబ్బాలను ప్రభుత్వం స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కింద గ్రామాలకు సరఫరా చేసింది. కొన్ని గ్రామాల్లో సిబ్బంది లేకపోవడంతో ఇవన్నీ వృథాగా మారాయి. వీరవాసరం పంచాయ తీకి కేటాయించిన రిక్షాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పుపట్టిపోతు న్నాయి. పంచాయతీల్లో చెత్త సేకరణకు అవ సరమైన సిబ్బంది ఉన్నారా.. లేదా అని చూడకుండా కొందరు గుత్తేదారులకు లబ్ధి చేకూర్చేలా ఏటా జిల్లా స్థాయిలో రిక్షాలు కొనుగోలు చేసి వాటిని పంచాయతీలకు అంటగడు తున్నారు. వినియోగించే పరిస్థితి లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. గతేడాది వందల సంఖ్యలో రిక్షాలు సమ కూర్చారు. పంచాయతీల నిధుల నుంచి వీటికి సంబంధించిన బిల్లుల చెల్లిం పులు పూర్తి చేశారు. ఇవి వచ్చే నాటికే అంతకు ముందు ఏడాది మంజూరు చేసిన రిక్షాలు మూలకు చేరాయి. కొన్ని గ్రామాల్లో రిక్షాలను ఒక్కసారి కూడా వినియోగించిన దాఖలాలు లేవు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమర్థవంతంగా నిర్వహించాలి

శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి

విశాలాంధ్ర-భీమడోలు: చక్కటి ప్రణాళిక సమన్వయంతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి ఆదేశించారు. భీమడోలు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహణపై మండలంలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయాల వాలంటీర్లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వాటిని గ్రామస్థాయిలో నిర్వహించే వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమంలో లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వాటా ఉన్న అన్ని పథకాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. ఇంకా పథకాలు లబ్ధి పొందని వారిని గుర్తించి వారికి కూడా పథకాలు అందే విధంగా చొరవ చూపాలన్నారు. జిల్లా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను వివరించారు. గ్రామస్థాయిలో స్వాగత, సాంస్కృతిక ,ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కే ఖాజావలి, డి ఎల్ డి ఓ, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ సి సత్యనారాయణ, ఐసిడిఎస్ పిడి పద్మావతి , పశు సంవర్ధక శాఖ జేడీ నెహ్రూ బాబు, తహసీల్దార్ ఇందిరాదేవి,ఎంపీడీవో పద్మావతి దేవి,తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని సర్పంచ్‌లుగా గుర్తించండి

విశాలాంధ్ర-పెంటపాడు: పెంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన పెంటపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో గ్రామాల్లో సర్పంచులను గుర్తించడం లేదంటూ బుధవారం పెంటపాడు మండల సమావేశానికి విచ్చేసిన ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ వద్ద పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ అతిథులుగా దర్శిపరు సర్పంచ్ కోలా శేషవేణి, యానాలపల్లి సర్పంచ్ హాజరయ్యారు. కొత్త పింఛన్లు పంపిణీ సచివాలయాల ప్రారంభోత్సవానికి తమను ఆహ్వానించడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ మీ సమస్యలను పరిష్కరించే దిశగా ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్తా నని సర్పంచులకు తగిన సముచిత న్యాయం కల్పించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు మండల ఎంపీపీ దాసరి హైమావతి, పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, పెంటపాడు మండలం వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, పెంటపాడు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి చంద్రకళ, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా బలరాముని పూజాక్షతలు ఊరేగింపు

విశాలాంధ్ర -ఉండి: అయోధ్య బలరాముని పూజాక్షతలు ఊరేగింపు కార్యక్రమాన్ని ఉండి మెయిన్ సెంటర్ లోని రామతీర్థ క్షేత్రం నుండి శివాలయం వరకు ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. శివాలయంలో ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు సన్నిధిరాజు శేషగిరి, సన్నిధి రాజు చలపతిరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు సన్నిధి రాజు చలపతిరావు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా అయోధ్యలో నిర్మిస్తున్న రామ మందిరం ప్రారంభోత్సవం జనవరిలో జరుగుతుందని అయోధ్య నుండి ప్రతి జిల్లా కేంద్రాలకు పూజ అక్షతలు పంపించడం జరిగిందని అక్కడి నుండి నేడు రామతీర్థ క్షేత్రానికి అక్కడినుండి శివాలయానికి ఊరేగింపుగా తీసుకురావడం జరిగిందని నేటి నుండి నాలుగు రోజులు పాటు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా సత్య కృష్ణ కిరణ్ ప్రసాద్ ను గ్రామ పెద్దలు గుండాబత్తుల సుబ్బారావు, కొమ్మన నాగబాబు, మానే ప్రసాద్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు, శశి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాసరావు, ఏడిద నెహ్రూ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా నల్లా సత్య కృష్ణ కిరణ్ ప్రసాద్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా గత కొన్ని సంవత్సరాల నుండి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని కానీ అయోధ్య బలరాముని పూజాక్షంతలు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రముఖులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వైసీపీ నుండి టిడిపిలోకి భారీగా చేరికలు

విశాలాంధ్ర - గోకవరం : గోకవరం మండలం గోకవరం గ్రామంలోని ఎరకల దిబ్బకాలనీ (ఇందిరమ్మ కాలనీ) కి చెందిన వైసీపీకి చెందినవారు టిడిపిలో చేరారు. మైనార్టీలు, దళితులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి జ్యోతుల నెహ్రూ నాయకత్వాన్ని బలపరుస్తూ తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ టిడిపి కండువాలతో సాదర స్వాగతం పలికారు. మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ, మాజీ జెడ్పిటిసి పాలూరి బోసి బాబు, ఎస్సి సెల్ రాష్ట్ర సెక్రెటరీ గునిపే భరత్ ఆధ్వర్యంలో వీరందరూ జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ.. రాబోయేది టిడిపి జనసేన సంకీర్ణ ప్రభుత్వమేనని విజినరీ నాయకుడు చంద్రబాబు, పోరాటయోధుడు పవన్ కళ్యాణ్ తో కలిసి సంక్షేమ ప్రభుత్వాన్ని అందించబోతున్నారని అన్నారు.

మణిరత్నంను పరామర్శించిన కందుల దుర్గేష్

విశాలాంధ్ర - గోకవరం : గోకవరం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం ను జనసేన పార్టీ ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు కందుల దుర్గేష్ పరామర్శించారు.మణిరత్నంపై దాడికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై స్టేట్ సమన్వయ కమిటీ సమావేశంలో ప్రస్తావిస్తానని బాధితుడికి ఆయన హామీ ఇచ్చారు. పొత్తు ధర్మంలో భాగంగా తెదేపా జనసేన నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు గౌరవించుకోవాలన్నారు. తప్పకుండా మణిరత్నంకు న్యాయం జరుగుతుందని జన సైనికులకు కందుల దుర్గేష్ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి దాసపాటి సుబ్బారావు, గండేపల్లి మండల అధ్యక్షుడు గోన శివ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘాల మహా ధర్నా విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాజులూరు : రైతు సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27, 28వ తేదీలలో విజయ వాడలో జరుగనున్న మహాధర్నాను రైతులందరూ విజయవంతం చెయ్యాలని ఎపి కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, మహాధర్నా మండల కన్వీనర్ వల్లు రాజబాబు అన్నారు. ఈ మేరకు బుధవారం సీపీఎం నాయకులు మండల గ్రామాలలో పర్యటించి కరపత్రాలు, గోడ పత్రికలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కాజులూరులో రాజబాబు మాట్లాడుతూ అఖిల భారత రైతు సంఘాలు ఢిల్లీలో చేపటిన భారీ ఆందోళనలకు ప్రధాని నరేంద్రమేదీ దిగివచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని ఇది జరిగి రెండు సంవత్సరాలు కావస్తున్న ఒక్క డిమాండ్ కూడా అమలు కాలేదన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరశిస్తూ మహాధర్నాకు అఖిల భారత రైతు సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. రైతులందరూ అధిక సంఖ్యంలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు సలాది నారా యణ, నామ వీరన్న, యాళ్ళ శ్రీనివాసు, దేవు సత్యనారాయణ, పేపకాయలు సుబ్బారావు, దొరబాబు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన రాజశ్యామల యాగం

విశాలాంధ్ర - సీతానగరం/రాజానగరం: వేదపండితుల మంత్రోశ్చర ణతో బుధవారం రాజశ్యామల యాగం ప్రారంభమైంది. రాజానగరం నియోజకవర్గ పరిధిలో కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బత్తుల బలరామ కృష్ణ వెంకటలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో యాగం ప్రారంభమైంది. ఈ యాగం 22 నవంబర్ నుండి 27 నవంబర్ వరుకూ జరుగుతుంది. శ్రీ శతకుండాత్మక, మహారుద్ర, శతసహస్ర మహాచండీ సహిత శ్రీ రాజశ్యామల యాగం మొదటి రోజులో భాగంగా ఈ రోజు అశేష భక్తజనం నడుమ శ్రీ షోడశ మహాగణపతి హెూమంతో ఘనంగా ప్రారంభించారు. అలగే యాగం వచ్చిన భక్తులకు అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో తోట పవన్ , ప్రత్యూష దేవి దంపతులు, వేద పండితులు, యాగ నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

సురేష్ కుటుంబానికి ఆర్థికసాయం



విశాలాంధ్ర-దేవరపల్లి: జనసేన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని సేవలందించిన కోట సురేష్ ఇటీవల ప్రమాదానికి గురై మృతి చెందారు. ఆ కుటుం బాన్ని ఆదుకోవటానికి బుధవారం దేవరపల్లిలో సురేష్ ఇంటికి వెళ్లి 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణ రాజు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు అని శెట్టి గంగరాజు కంబాల సత్తిబాబు సూరిశెట్టి బాలు జాజిమొగ్గల శ్రీనివాస్ అడబాల మణికంఠ నిజంపూడి నాగరాజు తంగెళ్ల గంగాధరం మాటూరి నాని కవల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని భవన నిర్మాణం నిలిపివేత

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని గేటు సెంటర్లో ప్రధాన రహదారి పక్కన పూర్తిస్థాయిలో సరైన అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గుప్పాల శ్రీనివాస్ అపార్ట్మెంట్ భవనం పనులను జిల్లా ఉన్నతాధికారులు నుండి అనుమతులు వచ్చే వరకు పనులు నిలుపుదల చేయాలని కాట్రేనికొన పంచాయతీ సెక్రటరీ కె. శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేశామన్నారు. ఈ నెల 20వ తేదీన పక్క స్థల యజమాని ఆకాశం శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పిర్యాదు చేశారు. ఈ మేరకు పూర్తి వివరాలు సేకరించి తగు చర్యలు తీసుకోవాలని నివేదికను సమర్పించమని కలెక్టర్ ఆదేశించారు. అనుమతులు లేకుండా ఇటీవల కాలంలో నిర్మించిన గృహ యాజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

వైసీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తోట రవి అన్నారు. బుధ వారం కిర్లంపూడి మండలం ఎస్ తిమ్మాపురం గ్రామంలో ఏపీ నీడ్ వైఎస్ జగన్ కార్యక్రమాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు, సర్పంచ్ మందేటి వీరలక్ష్మి, వైసీపీ నాయకులు వనపర్తి వీరభద్రరావు పలువురు వైసిపి నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించడమే కాకుండా, ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎంపీపీ తోట రవి పాల్గొని మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి లబ్ది చేకూర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తోట గాంధీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సంఘన వెంకటేశ్వరరావు, సర్పంచ్ మందేటి వీరలక్ష్మి, వనపర్తి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణునిపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్

విశాలాంధ్ర - గోకవరం : మండలంలోని కృష్ణుని పాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి జోగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం వై ఎ పి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల పరిషత్ అధ్యక్షురాలు సుంకర శ్రీవల్లి వీరబాబు పాల్గొని నాయకులతో కలిసి సంక్షేమ పథకాల లబ్దిని తెలిపే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు గ్రామంలో సుమారు 16 కోట్ల రూపాయలతో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. 80 లక్షల రూపాయలతో డ్రైనేజీ, సిసి రోడ్లు నిర్మాణం, మరో 80 లక్షల రూపాయలు తో నాడు నేడు స్కూల్ అభివృద్ధి పనులు, 20 లక్షల రూపాయలతో సంజీవ్ నగర్‌లో ఇంటింటి కుళాయి, రెండో విడతగా 20 లక్షల రూపాయలతో కృష్ణునిపాలెం, 10 లక్షల రూపాయలతో కొత్తూరు గ్రామాల్లో ఇంటింటికుళాయి నిర్మించారు. రామన్నపాలెంలో రూ.8 లక్షలు, వెంకటాపురంలో రూ.8 లక్షలు, చెన్నూరులో రూ.8 లక్షలతో ఇంటింటి కుళాయిలు నిర్మించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, వైయస్సార్ పార్టీ మండలకన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ అధ్యక్షులు గాజింగం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహారాణి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : రాజా వత్సవాయి బుచ్చి సీతాయ్యమ్మ జగపతి బహుదూర్ మహారాణి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. మహారాణి 188వ వర్ధంతి వేడుకలు బుధవారం మహారాణి సత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాణి ఆశయాలను సత్రంలో తూచా తప్పకుండా పాటించడం అభినందనీయ మన్నారు. 1882లో స్థాపించిన సత్రం దినదినాభివృద్ధి చెంది బాటసారులకు, విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. తొలుత మహారాణి విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు సాయి ప్రసాద్, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అపోలోలో అధునాతన రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్

విశాలాంధ్ర-రాజమండ్రి: ఆరోగ్య సంరక్షణలో మరో కొత్త శకానికి నాంది పలుకుతూ, అపోలో క్యాన్సర్ సెంటర్, చెన్నై దక్షిణాసియాలో మొట్టమొదటి సైబర్‌నైఫ్ ఎస్ 7 ఎఫ్ఐఎం రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్‌ని పరిచయం చేసింది ఇందులో భాగంగా క్యాన్సర్ క్యాన్సర్ కాని కణితులకు ఖచ్చితమైన చికిత్సా విధానాన్ని అందిస్తోందని సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజీ డాక్టర్ మహదేవ్ పోతరాజు, చెప్పారు. సైబర్‌నైఫ్ సిస్టమ్ ప్రవేశం క్యాన్సర్ సంరక్షణ టెక్నాలజీలో ఒక గొప్ప క్షణాన్ని సూచిస్తుందని, దక్షిణాసియాలో ఈ అద్భుతమైన టెక్నాలజీని ప్రవేశపెట్టిన మొట్టమొదటి సంస్థ అపోలో క్యాన్సర్ సెంటర్ అవడం ద్వారా, ఇది కొత్త మైలురాయిని చేరుకుందన్నారు. సైబర్‌నైఫ్ ఎస్ 7 ఎఫ్ఐఎం సిస్టమ్ అనేది క్యాన్సర్ మరియు క్యాన్సర్ కాని కణితులకు మరియు రేడియేషన్ థెరపీని సూచించే ఇతర పరిస్థితులకు నాన్-ఇన్వాసివ్ చికిత్స. ఇది మెదడు, ఊపిరితిత్తులు, వెన్నెముక, ప్రోస్టేట్ మరియు పొత్తికడుపు క్యాన్సర్‌లతో సహా శరీరం అంతటా ఉన్న పరిస్థితులకు చికిత్స చేయడానికి ఉపయోగించబడుతుందన్నారు. శస్త్రచికిత్స చేయలేని లేదా శస్త్రచికిత్స ద్వారా సంక్లిష్టమైన కణితులు ఉన్న రోగులకు శస్త్రచికిత్సకు ప్రత్యామ్నాయంగా ఉండవచ్చునని చెప్పారు. గతంలో రేడియేషన్‌తో చికిత్స పొందిన రోగులు, మెటాస్టాటిక్ గాయాలు లేదా పునరావృత క్యాన్సర్‌లు ఉన్నవారు కూడా సైబర్‌నైఫ్ చికిత్సను పొందవచ్చునని వివరించారు.

జగనన్న పథకాలతో పేదలకు లబ్ధి

విశాలాంధ్ర - కరప : జగనన్న పథకాలతో పేదల లబ్ధి పొందుతున్నారని ఎంపీపీ పెంచే లక్ష్మీ సత్తిబాబు పేర్కొన్నారు. కరప మండలం పాతర్ల గడ్డ గ్రామంలో సర్పంచ్ ఏసుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జడ్పిటిసి వై సుబ్బారావు పాల్గొని వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. మండల వైసిపి పార్టీ అధ్యక్షుల చింత ఈశ్వరరావు, ఈఓ ఆర్‌డి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, నక్క సత్తిబాబు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దాళ్వాపై వరి రైతులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి-2 రైతు భరోసా కేంద్రంలో రైతులకు ముందస్తు దాళ్వా వరి సాగుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు మండల వ్యవసాయ అధికారి జి. కుమార్ బాబు 120 రోజులు పంట కాలం వరి రకాలు ఎంటియు 1121(శ్రీధృతి), ఎంటియు 1156(తరంగిని) లను డిసెం బర్ మొదటి వారంలోపు నారుమడులు వేసుకుని మార్చి 31లోపు పంట కోతకు వచ్చేలాగా రైతులు ముందస్తుగా దాళ్వా వరి సాగుకు సిద్ధం కావాలని కోరారు. సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతులు నాగులపల్లి సూర్యనారాయణ (అబ్బులు), చీకట్ల భైరవ స్వామి, రాయపురెడ్డి నాగు, వివిఎ బి వినీత పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్ళీ గెలిపించండి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక 6 డివిజన్ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ప్రదర్శన బోర్డును ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్‌కమిటీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంతంగా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి నేరుగా బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల సొమ్మును జమ చేస్తోన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించుకుంటే పేదల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, స్థానిక నాయకులు తెలుగు రామకృష్ణ, జార్జి, సారథి, అంజిబాబు, రెడ్డి, నందకుమార్, తొంపల తాతారావు, సిగల మధు, బత్తిన రాజు తదితరులు పాల్గొన్నారు.